క్లుప్తంగా

శంబాన వెంకటరావుకు నివాళులు



శంబానకు నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలోని వెలమపేటకు చెందిన శంబాన వెంకటరావుకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర నివాళులు అర్పించారు. ఇటీవల వెంకటరావు మరణించిన నేపథ్యంలో వెలమపేటలో బుధవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో రాజన్నదొర పాల్గొని వెంకటరావు చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చి, ధైర్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రవేశ్ కార్యక్రమాలు అమలు చేయండి

• ఎంఈఓ సామల సింహాచలం

బలిజిపేట: విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పాఠశాలలో విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని 13వ తేదీ నుంచి ప్రారంభించాలని ఎంఈఓ సామల సింహాచలం తెలిపారు. పాఠశాలలు 13వ తేదీనుంచి ప్రారంభం అవుతున్నందున నాటి నుంచి 90రోజులపాటు కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని పిలుపునిచ్చారు. పాఠశాల వాతావరణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, విద్యార్థులకు మంచినీరు అందించడం, టాయిలెట్ సౌకర్యాలు వంటి వాటిని సక్రమంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు పుస్తకాలు అందించనున్నామన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు



కాలువల్లో పూడిక తీతను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: మండలంలో దోమల నివారణకు గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, కాలువల్లో పూడిక తీత, బ్లీచింగ్ చల్లే కార్యక్రమం కొనసాగుతోందని ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన లచ్చయ్యపేట,అంటిపేట గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయాగ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్: మండలంలోని చెరువుల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ బుధవారం పరిశీలించారు. తంపటాపల్లి, తుమరాడ, చింతాడ, అట్టలి, తదితర గ్రామాల్లో అభివృద్ధి చేసిన చెరువుల తాజా స్థితిగతులను ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో క్షేత్ర పర్యటన ద్వారా సమస్యలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సాగు, తాగునీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

భామిని: మండలంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. రబీలో వరి సాగు చేసిన రైతులు మరోసారి ఖరీఫ్‌లో వరి వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇటీవల రబీ వరి కోతలు, నూర్పులు చేసిన పోలాలల్లోని వరి దుబ్బులను కాల్చుతున్నారు. ఖరీఫ్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. ఇప్పటికే చాలామంది రైతులు విత్తనాలు, ఎరువులు తీసుకున్నారు.

అతివేగం అనర్థదాయకం



పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: అతివేగం అనర్థదాయకమని ఎస్సై ఎన్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. పట్టణంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మితిమీరిన వేగంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

బలిజిపేట:

సమాజంలో బాల్యవివాహాలను అరికట్టాలని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాగించాలని మాస్టర్ ట్రైనీ సన్నిబాబు పిలుపునిచ్చారు. మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమ్మాయిలకు 18సంవత్సరాలు పూర్తయ్యేవరకు వివాహాలు చేయరాదని చెబుతూ దానివల్ల వారికి కలిగే నష్టాలను వివరించారు. బాల్యవివాహ చట్టంపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను చదివించాలని హితవు పలికారు. బాలకార్మిక వ్యవస్థ నివారణ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని బడిఈడు పిల్లలు బడిలో ఉంటేలా చూడాలని మహిళలకు సూచించారు. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు తగ్గించాలన్నారు. ఈ విషయాలను గ్రామస్థాయిలో చర్చించి ప్రజలకు అవగాహన కల్పించాలని వీఓఏలకు చెప్పారు. స్త్రీలు అన్ని రంగాల్లో పురుషులతో సమాన హక్కులు పొందాలని, జీవనప్రమాణాలు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ పి.సురేష్, ఏపీఎం ఉమామహేశ్వరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మేరీ, సీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనీ సన్నిబాబు

బాల్యవివాహాలు నేరం

సాలూరు: బాల్యవివాహాలు నేరమని, బాల్యవివాహాలు చేసి చిన్నారుల భవిష్యత్‌ను నాశనం చేయరాదని సీడీపీఓ సత్యవతి కోరారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని బంగారమ్మ కాలనీ, బంగారమ్మపేట, చినహరిజనపేటలలో సీడీపీఓ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో కళాజాతా కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడ పిల్లలకు విద్య, ఆరోగ్యం, పోషణ ముఖ్యమైన అంశాలన్నారు. ఆడపిల్లలను చదివించి వారిని ఉన్నతస్థాయికి తీసుకువెళ్లే బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని, మంచి పోషకాహారం అందించి ఆడపిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని సూచించారు. బాలికలకు రక్తహీనత రాకుండా తగు చర్యలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు,అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ సత్యవతి

30 వసారి రక్తదానం



రక్తదానం చేస్తున్న నొత్త చిన్నారావు

పార్వతీపురంటౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సహాయకుడు ఎమ్మార్‌నగరం గ్రామానికి చెందిన నొత్త చిన్నారావు 30వ సారి రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. అనసభద్ర గిరిజన గ్రామానికి చెందిన తలసీమియా పేషెంట్ అఖిల్ తేజ (ఐదు సంవత్సరాలు)కు ఎ+ పాజిటివ్ రక్తం అత్యవసరమని వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని పేషెంట్ బంధువులు రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సహాయకుడు నొత్త చిన్నారావుకు తెలియజేయగా వెంటనే ఆయన స్పందించి పార్వతీపురం జిల్లా హాస్పిటల్‌లో ఉన్న బ్లడ్ బ్యాంకులో 30వ సారి రక్తదానం చేసి గిరిజన బాలుడి ప్రాణాలు కాపాడారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, సెక్రటరీ బీఎస్‌బీ రావులు ఈ సందర్భంగా మాట్లాడుతూ నొత్త చిన్నారావు రక్తదానం చేస్తూ ప్రాణాలు కాపాడడమే కాకుండా ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. మరెన్నో మంచి సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు తాడి రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం



మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి హెచ్‌ఎంలు పాఠశాల వాతావరణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు మంచినీరు, టాయిలెట్స్ సౌకర్యం కల్పించడం అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు హెచ్‌ఎంలు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన విద్యార్థుల నమోదును చేపట్టాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, స్కూల్‌బ్యాగ్, షూస్, బెల్ట్ తదితర వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్స్ ఇప్పటికే ఎంఈఓ కార్యాలయాలకు చేరాయన్నారు. స్టూడెంట్స్ యూనిఫామ్ ఇంకా రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే పాఠశాలలకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని ఎంఈఓ సామల సింహాచలం పేర్కొన్నారు.

పనికి తగిన వేతనం



బుడ్డిపేటలో వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఏపీఓ భాను

• ఉపాధి హామీ పథకంలో రోజుకు రూ.242 కిట్టుబాటు

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకంలో పనికి హాజరయ్యే వేతన దారులకు పనులు కల్పించడంతో పాటు రైతుల అవసరాలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం, చెరువుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదభోగిలి పంచాయతీ బుడ్డిపేట గ్రామంలో వేతనదారులు చేస్తున్న పనులు, రోడ్డు అభివృద్ధి పనులను, వేతన దారుల ఆన్‌లైన్ మస్తరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో బుధవారం నాడు 7 వేల మంది వేతనదారులు పనుల్లో పాల్గొన్నారని తెలియజేశారు. వేతన దారులు చేస్తున్న పనిని అనుసరించి వేతనం గిట్టుబాటవుతుందన్నారు. సరాసరి ఒక్కో వేతన దారునికి రోజుకు రూ.242 కిట్టుబాటవుతుందన్నారు. బుడ్డిపేటలో 240 మంది వేతన దారులు ఉపాధి పనుల్లో పాల్గొన్నారని, వచ్చిన వేతన దారుల మస్తరును పరిశీలించినట్లు చెప్పారు.

బడిఈడు పిల్లల్ని పాఠశాలల్లో చేర్పించాలి

సీతానగరం: బడి ఈడులో ఉన్న వారిని పాఠశాలల్లో చేర్పించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అంతర్జాతీయ బాల కార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి సహకారంతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో చీఆయా గ్రామాల పెద్దలు, ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు సర్వే నిర్వహించి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో కార్మికశాఖ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్ శాఖల అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు.

స్టూడెంట్ కానుక పంపిణీకి చర్యలు

గరుగుబిల్లి: పాఠశాలలు గురువారం నుంచి పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో స్టూడెంట్ కానుక కిట్లతో పాటు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మండల విద్యాశాఖాధికారి నగిరెడ్డి నాగభూషణరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పాఠశాలలు ప్రారంభం రోజున విద్యార్థులకు కిట్లతో పాటు పాఠ్య పుస్తకాలను అందజేయనున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొండ: స్థానిక ఏరియా ఆస్పత్రిలో అగ్నిమాపకశాఖ సిబ్బంది బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అలాగే రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేసి రోగులను తరలించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ నాగభూషణరావు, ఆర్‌ఎంఓ చిరంజీవి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భోగాపురం: విమానాశ్రయం నిర్మాణ ప్రాంతంలో 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మండలంలోని ఎ.రావివలస, గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగడపేట ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, చాకివలస, జీఎంఆర్ విమానాశ్రయ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ జి.సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధి పనులు త్వరగా పూర్తిచేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌నాయుడు

బలిజిపేట: ఉపాధి పనులను త్వరగా పూర్తిచేయించాలని ఎంపీడీఓ రమేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఈసీ, ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావడంతో పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. సాగునీటి కాలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. పండ్లతోటల పనులు ప్రారంభించాలని, ఫారంపాండ్‌లు, కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యం పనులు త్వరగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. వేతన దారుల ప్రాప్తిన తగిన విధంగా పనుల ప్రతిపాదనలు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సాలూరు రూరల్: ఆడపిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీఓ సత్యవతి హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ఆమె సాలూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆడపిల్లల పెంపకం వారి బాగోగులు విషయంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు చేయాలని, బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. బాలికలను రక్షించుకోవాలని వారిని చదివించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, ధనలక్ష్మి ఆయా సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



తోణాంలో ఆడపిల్లల సంరక్షణపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ సత్యవతి

న్యాయం చేయాలి..

వీరఘట్టం: ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి కొత్త మద్యం పాలసీని తీసుకురానున్న నేపథ్యంలో మద్యం షాపుల్లో పనిచేస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. కొత్త మద్యం పాలసీ వస్తే తమ పరిస్థితేమిటని ప్రశ్నిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చినా, తమకు న్యాయం చేయాలని కోరారు.



నిరసన తెలియజేస్తున్న మద్యం దుకాణం ఉద్యోగులు

లోతు దుక్కుతో కలుపు నివారణ

పాలకొండ రూరల్: ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు లోతు దుక్కులు చేపట్టడం ద్వారా కలుపు నివారణ సులభతరమవుతుందని ఏఓ ఎన్ని వాహిని సూచించారు. మండలంలోని గరుగుబిల్లిలో బుధవారం రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముంపు భూముల్లో సేద్యానికి అనుకూలంగా ఉన్న వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. లోతు దుక్కుల అవశ్యకతపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకుడు అమిత్ పాడి మాట్లాడుతూ.. స్వర్ణ మసూరి-7029, 1061, 1318 వంగడాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేను సంప్రదించాలన్నారు.

నేడు ఆశ్రమ వసతిగృహాలు పునఃప్రారంభం

సీతంపేట: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, రెసిడెన్షియల్ స్కూల్స్ గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ఇచ్చిన విషయం తెలిసిందే. గిరిజన విద్యాసంస్థలన్నీ పునఃప్రారంభం కానుండడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాల సిబ్బంది వసతిగృహాల పరిసరాలు, తరగతి గదులను శుభ్రం చేస్తున్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో విద్యార్థులంతా ఆశ్రమ పాఠశాలల్లోనే ఉండి చదువు కోవాలి కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



సీతంపేటలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల

నీతితో జీవించాలి..



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

గుమ్మలక్ష్మీపురం: క్రీస్తు బోధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నీతితో పరిశుద్ధంగా జీవించాలని పాస్టర్లు సీహెచ్ సంతోష్‌రెడ్డి, వి. ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఏసు ప్రార్థనామందిరంలో పాస్టర్ పి. సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీ నుంచి జరుగుతున్న 'ఆత్మల సంపాదన మహా పండుగ' బుధవారంతో ముగిశాయి. కార్యక్రమంలో క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరి విత్తనాలు సిద్ధం

• నియోజకవర్గంలో 20 వేల ఎకరాల్లో సాగు
• సబ్సిడీపై విత్తనాల పంపిణీ



గోవిందపురం ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

పూసపాటిరేగ: నైరుతి రుతుపవనాల రాకతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే రైతులు మెట్ట పంటల సాగుకు ఉపక్రమించారు. ఖరీఫ్ వరి పంట సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు వరి విత్తనాలను అధికారులు రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై విక్రయిస్తున్నాయి. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 20 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. పూసపాటిరేగ మండలంలో 5,900, డెంకాడలో 5,200, నెల్లిమర్లలో 4,700, భోగాపురంలో 4,500 ఎకరాల్లో సాగు జరుగుతోంది. పచ్చిరొట్ట ఎరువుల సాగుకు వీలుగా జీలుగ, కట్టె జనుమ, పిల్లి పెసర విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా విక్రయిస్తున్నారు. వరి వంగడాలైన ఎంటీయూ-1121 రకం, బీపీటీ-5204, బీపీటీ-3291, ఎంటీయూ-1224 రకాలను ఆర్‌బీకేల్లో సిద్ధం చేశారు. పూసపాటిరేగ మండలంలో ఎంటీయూ-1121 రకం 840 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 60 క్వింటాళ్లు, బీపీటీ 3291 రకం 60 క్వింటాళ్లు, ఎంటీయూ-1224 రకం 20 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి కొల్లి నీలిమ తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

• ఈఓపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యమని ఈఓపీఆర్‌డీ ఎల్. గోపాలరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో చేపడుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కాలువల్లో పూడికతీత పనులు, మలాథియాన్ పిచికారీ వంటి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కోటేశ్వరరావు, తదితరులున్నారు.



ఉల్లిభద్రలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఈఓపీఆర్‌డీ గోపాలరావు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల పరిధిలోని రావివలసలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను రుగడ విశ్వనాథం, బుక్కూరు గణేష్, కొండూరు సోమేశ్వరరావు, రుగడ సురేష్, తదితరులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గుంట్రెడ్డి సత్యనారాయణ, గుంట్రెడ్డి సురేష్‌కుమార్, గుంట్రెడ్డి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.